అర్హులది కాదు.. అనర్హుల జాబితా..

- సిరికొండలో అధికారులను నిలదీసిన ప్రజలు
- పలు గ్రామాల్లో అధికారులకు బదులు కాంగ్రెస్ నాయకులు మాట్లాడడంపై ఆగ్రహం
- పథకాల కోసం ఎన్నిసార్లు దరఖాస్తు చేసుకోవాలని ప్రజల అసహనం
- ఇంత నిర్లక్ష్యంగా ఎలా గ్రామసభ నిర్వహిస్తారని సులేమాన్‌నగర్‌లో మూడు గంటలపాటు నిలిపివేత

నమస్తే తెలంగాణ యంత్రాంగం, జనవరి 22 : రైతుభరోసా, ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల పథకాలకు లబ్ధిదారుల ఎంపిక కోసం రెండోరోజు బుధవారం నిర్వహించిన గ్రామసభలు గందరగోళంగా మారాయి. అధికారులు అర్హుల జాబితాను చదివి వినిపిస్తుండగా.. తమ పేర్లు ఎక్కడికి పోయాయని గ్రామాల్లో పలువురు ఆగ్రహం వ్యక్తంచేశారు. పోలీసు బందోబస్తు మధ్య గ్రామసభలు కొనసాగాయి. దాదాపు అన్ని గ్రామసభల్లోనూ లబ్ధిదారుల ఎంపిక జాబితాపై ప్రజల నుంచి అసంతృప్తి వ్యక్తమైంది.

ఇందిరమ్మ ఇండ్లు, ఆత్మీయ భరోసా పథకాలకు అర్హులను కాకుండా అనర్హుల జాబితా ప్రకటించారని సిరికొండ గ్రామసభలో ప్రజలు అధికారులను నిలదీశారు. డిప్యూటీ తహసీల్దార్ ప్రవీణ్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించగా.. అనర్హులను లబ్ధిదారులుగా ఎలా గుర్తిస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

కోటగిరి మండలకేంద్రంలో ప్రజలు అధికారుల తీరుపై మండిపడ్డారు. పథకాలకు అర్హుల జాబితాను అధికారులు చదివి వినిపించి, అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని సూచించడంతో అనర్హుల పేర్లు జాబితాలో చేర్చారని, అర్హుల పేర్లు ఎటు పోయాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. జాబితాలో పేర్లు రాని అర్హులు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సూచించడంతో.. ఎన్ని సార్లు దరఖాస్తు చేసుకోవాలని గొడవకు దిగారు. పోలీసులు జోక్యం చేసుకొని ప్రజలను సముదాయించారు.

డిచ్‌పల్లి మండలంలోని ఖిల్లా డిచ్‌పల్లి, డిచ్‌పల్లి తండాలో ఎంపీడీవో శ్రీనివాస్‌గౌడ్, సుద్దపల్లి, దేవుపల్లి క్యాంప్‌లో తహసీల్దార్ ప్రభాకర్, మెంట్రాజ్‌పల్లి, నాకాతండాలో మండల ప్రత్యేకాధికారి యోహాన్, యానంపల్లి, యానంపల్లి తండాలో ఏవో సుధామాధురి, సాంపల్లి, సాంపల్లి తండాలో డీటీ శ్రీకాంత్ ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించారు. అర్హుల జాబితాలో ప్రభుత్వ ఉద్యోగులు, అనర్హుల పేర్లు వచ్చాయని, పేదల పేర్లు రాలేదని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పథకాల అమలు నిరంతర ప్రక్రియ అని, జాబితాలో పేరు లేని వారు ఈ నెల 24లోగా దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు సూచించారు.

రూరల్ మండలంలోని కొత్తపేట్, రామ్‌నగర్‌లో నిర్వహించిన గ్రామసభలో గందరగోళం నెలకొన్నది. భూమి ఉన్న వారికి కూడా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద పేర్లు ఎలా వచ్చాయని అర్హులైన కూలీలు అధికారులను నిలదీశారు. రామ్‌నగర్ గ్రామసభలో నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్రకుమార్, తహసీల్దార్ అనిరుధ్ పాల్గొన్నారు.

పొతంగల్ మండల కేంద్రంతోపాటు సుంకిని, కొల్లూరు, కారేగాంలో గ్రామసభలు నిర్వహించారు. వ్యవసాయ భూమి లేని పేద కుటుంబాలకు ఉపాధి హామీ జాబ్ కార్డు లేకపోయినా ఆత్మీయ భరోసా ఇవ్వాలని పొతంగల్ గ్రామసభలో బజరంగ్ హనుమాండ్లు ఆధ్వర్యంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో పనిచేసిన వారే కాకుండా అంతకుమందు పని చేసిన వారికి కూడా ఆత్మీయ భరోసా ఇవ్వాని కోరారు. జాబితాలో పేర్లు లేని వారే ఎక్కువగా ఉండడంతో మళ్లీ దరఖాస్తులు పెట్టుకునేందుకు ఎగబడ్డారు.

రుద్రూర్ మండలం సులేమాన్‌నగర్ గ్రామసభలో అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు

చందూర్ మండలంలోని లక్ష్మాపూర్‌లో గ్రామసభ నిర్వహించగా.. గుంట భూమి లేకపోయినా తమ పేర్లు ఎందుకు జాబితాలో లేని పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు.

భీమ్‌గల్ మండలంలోని బడా భీమ్‌గల్, ఎంజి తండా, సికింద్రాపూర్, రూప్లాతండా, మెండోరా, కారేపల్లి, బాచన్‌పల్లి, పిప్రి గ్రామ సభల్లో ఉన్నవారికే పథకాలు అందుతున్నాయని, తమకు రాలేదని ప్రజలు అధికారులపై మండిపడ్డారు. బాచన్‌పల్లిలో ఓ రైతు తనకు రుణమాఫీ కాలేదని, ముందు దాన్ని పరిష్కరించాలని పట్టుబట్టాడు. బడాభీమ్‌గల్‌లో గత ప్రభుత్వం 120 ఇండ్లు కట్టిస్తే.. ఇప్పుడు 400 దరఖాస్తులు ఎలా వచ్చాయని యువకులు సర్వే చేసిన సిబ్బందిని నిలదీశారు. ఉప్లూర్ గ్రామంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య వాగ్వాదం జరిగింది. మహిళలు ఇందిరమ్మ ఇండ్ల గురించి అధికారులను ప్రశ్నిస్తున్న సమయంలో కాంగ్రెస్ నాయకుడు సమాధానమివ్వడానికి మైకు తీసుకోవడంతో అధికారులు సమాధానం ఇవ్వాలని, కాంగ్రెస్ నాయకుడు సమాధానమివ్వడమేంటని ప్రశ్నించడంతో ఇరు వర్గాల మధ్య వాగ్వాదానికి దారితీసింది. దీంతో పోలీసులు కల్పించుకుని వారించారు. అదే సమయంలో అధికారులు వెళ్లిపోయారు.

ఇందిరమ్మ ఇండ్లు మాకెందుకు రాలేదని పలువురు మహిళలు ప్రశ్నించగా.. ఎంపీడీవో రాజశ్రీనివాస్ మాట్లాడుతూ.. దరఖాస్తు చేసుకుంటే పరిశీలిస్తామని, ఇప్పుడు వచ్చిన పేర్లు ఫైనల్ కాదని తెలిపారు. ఎన్ని సార్లు దరఖాస్తు చేసుకోమంటారని వట్యాట్ గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎలాంటి తీర్మానాలు చేయకుండానే గ్రామసభలను ముగించారు. ఆర్మూర్ మండలంలోని దేగం, సుర్బిర్యాల్‌లో నిర్వహించిన గ్రామసభల్లో ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి పాల్గొన్నారు. ఇంటి స్థలం లేని వారికి స్థలంతోపాటు రూ.ఐదు లక్షలు మంజూరు చేయాలని ఆర్మూర్ 19వ వార్డు కౌన్సిలర్ నరసింహారెడ్డి డిమాండ్ చేశాడు. వేల్పూర్ మండలంలోని మోతె గ్రామంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందజేయాలని అధికారులను గ్రామస్తులు నిలదీశారు. అర్హులందరికీ రేషన్ కార్డులు అందజేయాలని బోధన్‌లో నిర్వహించిన వార్డు సభల్లో ప్రజలు అధికారులను కోరారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూస్తామని బోధన్ 18వ వార్డు కౌన్సిలర్, బీఆర్ఎస్ పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బెంజర్ గంగారాం అన్నారు. ఇక్కడే పుట్టి, పెరిగిన తమ పేర్లు లిస్టులో లేవని బెల్లాల్‌లో నిర్వహించిన గ్రామసభలో ప్రజలు అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇతర ప్రాంతాల నుంచి బతకడానికి వచ్చిన వారిపేర్లు ఎలా వస్తాయని నిలదీశారు. నవీపేట మండలంలోని మహంతం గ్రామంలో తమకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం వర్తింపజేయాలని, ఇందిరమ్మ, ఇండ్లు, రేషన్ కార్డులు ఇవ్వాలని ఆర్డీవో రాజేందర్‌కుమార్, ఎంపీడీవో నాగ్‌నాథ్‌ను ప్రజలు నిలదీశారు. సభలో గంటసేపు గందరగోళం ఏర్పడింది. మోకన్‌పల్లిలో సైతం అదే పరిస్థితి నెలకొన్నది.

బాల్కొండ మండలంలోని కిసాన్‌నగర్‌లో ఇందిరమ్మ ఇండ్లు పేదలకు కాకుండా పెద్దలకు అనుకూలంగా ఉన్నవారికి అధికారులు ఇచ్చారని గ్రామస్తులు ఆరోపించారు. విదేశాల్లో ఉన్న వారికి, ప్రభుత్వ ఉద్యోగులకు, భూమి ఎక్కువగా ఉన్న వారికి పథకాలు మంజూరు చేశారన్నారు. రెంజల్ మండలం కందకుర్తిలో నిర్వహించిన గ్రామసభలో ఎంపీవో రఫీ అహ్మద్‌ను ప్రజలు నిలదీశారు. ప్రజలు నిలదీయడంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి పరిస్థితి సద్దు మణిగేలా చేశారు, ఉదయం 8:30గంటలకు ప్రారంభం కావాల్సిన గ్రామ సభ అధికారుల రాకపోవడంతో ఆలస్యమైంది. దీంతో అధికారుల కోసం గ్రామస్తులు ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

మూడు గంటల పాటు నిలిచిన గ్రామసభ

రుద్రూర్, జనవరి 22 : రుద్రూర్ మండలం సులేమాన్‌నగర్‌లో నిర్వహించిన గ్రామసభ రసాభాసగా మారింది. మూడు గంటలపాటు గ్రామసభ నిలిచిపోయింది. రేషన్‌కార్డుల కోసం 10 సంవత్సరాల నుంచి దరఖాస్తు చేసుకున్న వారికి బదులుగా మూడేండ్ల క్రితం దరఖాస్తు చేసుకున్న వారి పేర్లు రావడంపై అధికారులను తప్పుబట్టారు. గ్రామంలో మొత్తం సుమారు 360 దరఖాస్తులు రాగా.. 96 మంది పేర్లు జాబితాలో వచ్చాయని.. ఇందులో 76 మంది మహారాష్ట్ర, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారివి ఉండగా.. కేవలం 20 మంది పేర్లు గ్రామస్తులవి ఉండడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. రేషన్‌కార్డులను జారీ చేయకుండా ఆపివేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి సంబంధించిన జాబితాలో అర్హుల పేర్లలో ఇంటిపేర్లు, భర్తల పేర్లు లేకపోవడంపై గందరగోళం నెలకొన్నది. ఇందిరమ్మ ఇండ్ల జాబితాలోపూర్తి చిరునామా లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంత నిర్లక్ష్యంగా అదికారులు ఎలా గ్రామసభ నిర్వహిస్తారని మూడు గంటల పాటు అడ్డుకున్నారు. సమాచారం అందుకున్న బోధన్ ఏసీపీ శ్రీనివాస్ గ్రామస్తులు, అధికారులతో మాట్లాడి సముదాయించారు. రేషన్‌కార్డులను హోల్డ్‌లో పెట్టి, అర్హుల నుంచి దరఖాస్తులను స్వీకరించేందుకు కౌంటర్లను ఏర్పాటు చేశారు.

జిరాక్స్ సెంటర్లకు పెరిగిన గిరాకీ

- వార్డు సభల ఎఫెక్ట్

బోధన్, జనవరి 22: ప్రజాపాలన పేరుతో పట్టణంలో వార్డుల వారీగా సభలు నిర్వహిస్తున్నారు. అర్హుల జాబితాల్లో పేర్లు లేని వారు అధికారులను ప్రశ్నించగా.. మరోసారి దరఖాస్తు చేసుకోవాలని సూచిస్తున్నారు. దీంతో దరఖాస్తుల కోసం ప్రజలు జిరాక్స్ సెంటర్లకు వెళ్తున్నారు. మాములు సమయంలో తీసుకునే దాని కంటే ప్రతి జిరాక్స్ కాపీకి రెట్టింపు డబ్బులు తీసుకొని ఫారాలను విక్రయిస్తున్నారు. దరఖాస్తులను తెల్ల కాగితంపై ఇచ్చినా స్వీకరిస్తామని అధికారులు తెలిపినా.. ప్రజలు మాత్రం జిరాక్స్ సెంటర్లకు పరుగులు తీస్తున్నారు. దీంతో జిరాక్స్ సెంటర్లకు గిరాకీ పెరిగింది.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు



సుంకెట్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

మోర్తాడ్/ ఆర్మూర్ టౌన్, జనవరి 22: అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందుతాయని, అందుకోసం గ్రామసభలను నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అన్నారు. మోర్తాడ్ మండలంలోని సుంకెట్, ఆర్మూర్ మండలం గోవింద్‌పేట్ గ్రామాల్లో బుధవారం నిర్వహించిన గ్రామసభలకు ఆయన హాజరై మాట్లాడారు. అనర్హులు ఉంటే జాబితా నుంచి వారి పేర్లు తొలగిస్తామని కలెక్టర్ తెలిపారు. అర్హుల పేర్లు లేకుంటే తిరిగి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సంక్షేమ పథకాల అమలు నిరంతర ప్రక్రియ అని తెలిపారు. కార్యక్రమాల్లో ఆర్డీవో రాజాగౌడ్, మోర్తాడ్ తహసీల్దార్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కందకుర్తి గ్రామసభకు అధికారులు సకాలంలో రాకపోవడంతో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

బెల్లాల్ గ్రామసభలో అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు

కిసాన్‌నగర్‌లో గ్రామస్తులను సముదాయిస్తున్న పోలీసు

పసుపు క్వింటాలుకు రూ. 15 వేలు ప్రకటించాలి

సమావేశంలో మాట్లాడుతున్న వి.ప్రభాకర్

జక్రాన్‌పల్లి, జనవరి 22 : క్వింటాలు పసుపునకు రూ.15 వేల మద్దతు ధర ప్రకటించాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి వి.ప్రభాకర్ డిమాండ్ చేశారు. మండలకేంద్రంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. నాలుగు దశాబ్దాల పోరాట ఫలితమే పసుపు బోర్డు సాధన అని, రైతులు ఎన్నో రూపాల్లో ఉద్యమాలు చేశారని, ఓ రైతు 12 ఏండ్లు చెప్పులు వేసుకోలేదని గుర్తు చేశారు. సమావేశంలో నాయకులు దేవారాం, ముత్తెన్న పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్లు ప్రారంభం

సిరికొండ, జనవరి 22 : వేసవికాల ప్రణాళికలో భాగంగా సిరికొండ సెక్షన్‌లో విద్యుత్ ఓవర్‌లోడ్ దృష్టిలో ఉంచుకొని మండలంలోని పలు గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశారు. వీటిని విద్యుత్ శాఖ అధికారులు బుధవారం ప్రారంభించారు. న్యావనంది, రావుట్లలో 100 కేవీఏ, దుప్యాతండా, తాటిపల్లిలో 25 కేవీఏ కెపాసిటీ ట్రాన్స్‌ఫార్మర్లను బిగించి, ప్రారంభించారు. మరో 8 ట్రాన్స్‌ఫార్మార్లను ఏర్పాటు చేశామని, త్వరలో ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు. డీఈ ఉత్తమ్ జాడే, ఏఈ చంద్రశేఖర్, లైన్ ఇన్‌స్పెక్టర్ బాల్‌చందర్, రాములు, లైన్‌మెన్ ఆనంద్ పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలు శిక్ష

వినాయక్‌నగర్, జనవరి 22 : నగరంలోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గాంధీచౌక్ వద్ద ఎస్‌హెచ్‌వో రఘుపతి ఆధ్వర్యంలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలం ముగ్గలపల్లికి చెందిన శంకర్, నాందేడ్‌లోని బెల్కొని గ్రామానికి చెందిన రాజేశ్ సాబ్రెబ్రావ్ మద్యం తాగి వాహనాలు నడిపినట్లు గుర్తించి, కేసు నమోదు చేసినట్లు తెలిపారు. బుధవారం సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చగా.. రెండు రోజుల చొప్పున జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారని ఎస్‌హెచ్‌వో తెలిపారు.

అర్ధరాత్రి వరరకు పాన్ షాప్ తెరిచిఉంచినందుకు..

వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ ప్రాంతంలో అర్ధరాత్రి వరకు పాన్‌షాప్ తెరిచి ఉంచిన సయ్యద్ మోసిన్‌కు కేసు నమోదు చేసి, కోర్టులో హాజరుపర్చినట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు.రెండు రోజుల జైలుశిక్ష విధిస్తూ మెజిస్ట్రేట్ తీర్పు ఇవ్వగా.. మొత్తం ముగ్గురిని జిల్లా జైలుకు తరలించినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

అనుమానితులు పోలీసులకు అప్పగింత

మోర్తాడ్, జనవరి 22: దొంగలుగా అనుమానం వచ్చిన ఇద్దరు వ్యక్తులను స్థానికులు పోలీసులకు అప్పగించారు. కమ్మర్‌పల్లిలోని భీమ్‌గల్ ఎక్స్ రోడ్డులో ఉన్న సూర్య స్టీల్ దుకాణంలోకి ఇద్దరు వ్యక్తులు బుధవారం రాత్రి దూరి, బయటికి వచ్చారు. గమనించిన స్థానికులు వారిని పట్టుకొని పోలీసులకు సమాచారం అందించారు. ఇద్దరు కూడా ముఖానికి నల్లని రంగు పూసుకొని ఉన్నారని, సాయంత్రం రెక్కీ నిర్వహించారని స్థానికులు తెలిపారు.

సంక్షిప్తంగా..

- **ఒకేషనల్ కళాశాల తనిఖీ-** ఖలీల్‌వాడి, జనవరి 22 : జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఒకేషనల్ కళాశాలను జిల్లా ఇంటర్ విద్యాధికారి రవికుమార్ బుధవారం తనిఖీ చేశారు. కళాశాల గదులను పరిశీలించి, యాజమాన్యంతో సమావేశమై పలు సూచనలు చేశారు.
- **ఇసుక రవాణా చేస్తున్న వాహనాల పట్టివేత -** పొతంగల్, జనవరి 22 : పొతంగల్ మండలంలోని మంజీరా నది నుంచి ఇసుక అక్రమ రవాణాచేస్తున్న టిప్పర్, బొలెరో వాహనాలను పొతంగల్ చెక్‌పోస్టు వద్ద మంగళవారం రాత్రి పట్టుకున్నట్లు ఎస్సై సందీప్ వెల్లడించారు. జల్లాపల్లి, హంగర్గ నుంచి రాత్రి వేళ ఇసుకను తరలిస్తుండగా పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.
- **రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన -** మోపాల్ (ఖలీల్‌వాడి/ శక్కర్‌నగర్, జనవరి 22 : మోపాల్ మండలం కంజర గ్రామంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఆర్టీఏ అధికారి కిరణ్‌కుమార్, సిబ్బందితో కలిసి రోడ్డు భద్రతా నియమాలపై బుధవారం అవగాహన కల్పించారు. బోధన్ ఎంవీఐ కార్యాలయ ఆవరణలో వాహనదారులకు రోడ్డు ప్రమాదాల నివారణపై బోధన్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ అవగాహన కల్పించారు.
- **పర్యావరణ పరిరక్షణపై అవగాహన -** ఆర్మూర్‌టౌన్, జనవరి 22: ఆర్మూర్‌లోని జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులకు కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణపై బుధవారం అవగాహన కల్పించారు. కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ బాధ్యులు విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు.
- **అంగన్‌వాడీ సెంటర్‌కు ఫర్నిచర్ బహూకరణ -** పొతంగల్, జనవరి 22 : మండలంలోని జల్లాపల్లి, అబాది గ్రామ అంగన్‌వాడీ కేంద్రానికి సామాజిక సేవాకర్త ఎంఏ. హకీమ్ రూ.28 వేల విలువ చేసే ఫర్నిచర్‌ను బుధవారం అందజేశారు. అంగన్‌వాడీ చిన్నారులతో పాటు ప్రైమరీ స్కూల్ విద్యార్థులకు భోజనం ప్లేట్లు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వివేక్, హంగర్గాఫారం మాజీ సర్పంచ్ ఎజాస్ ఖాన్, కో-ఆప్షన్ మాజీ సభ్యుడు ఇస్మాయిల్, ఉప సర్పంచ్ భీమ, మాజీ ఎంపీటీసీ రాములు, యూత్ ప్రెసిడెంట్ ఆరిఫ్, హామీద్, షేరు, దేవీసింగ్, రాములు పాల్గొన్నారు.
- **సౌండ్ సిస్టం వితరణ -** బోధన్ రూరల్, జనవరి 22: సాలూరా మండలంలోని హున్సా గ్రామ ప్రభుత్వ పాఠశాలకు హెచ్‌డీఎఫ్‌సీ ఇన్సూరెన్స్ నిజామాబాద్ బ్రాంచ్ మేనేజర్ రంజిత్, సాటాపూర్ మాజీ సర్పంచ్ వికార్‌పాషా కలిసి సౌండ్ సిస్టమ్‌ను వితరణ చేశారు. పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు సాయంత్రం పూట స్నాక్స్‌ను గ్రామ యూత్ ప్రెసిడెంట్ అరుణ్ సమకూరుస్తున్నారు. దాతలను సత్కరించారు. ఏఎంసీ వైస్ చైర్మన్ చీల శంకర్ తదితరులు పాల్గొన్నారు.
- **మధ్యాహ్న భోజనం పరిశీలన -** చందూర్, జనవరి 22 : మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తహసీల్దార్ శాంత పరిశీలించారు. పోషక విలువలతో కూడిన ఆహారాన్ని విద్యార్థులకు అందించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాస్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.
- **జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం -** శక్కర్‌నగర్, జనవరి 22: జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం పొందిన బోధన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల (జేసీ) ప్రధానోపాధ్యాయుడు బాలచంద్రంను బుధవారం పాఠశాల ఆవరణలో ఘనంగా సన్మానించారు. ఆయనకు శాలువాలు కప్పి సత్కరించారు. ఉపాధ్యాయులు శ్రీకృష్ణ, సుధాకర్ రెడ్డి, రాచప్ప, జ్యోతి, కళ్యాణి, వెంకట్, నెమలి సంజీవ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.
- **బడీడు పిల్లల తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ -** శక్కర్‌నగర్, జనవరి 22: బడికి వెళ్లకుండా ఇంటి వద్దనే ఉంటున్న పలువురు పిల్లల తల్లిదండ్రులకు ఎంపీవో నాగయ్య, పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆచన్‌పల్లి పాఠశాలకు సక్రమంగా వెళ్లని పిల్లలను గుర్తించి బుధవారం వారి ఇంటికి వెళ్లారు. 12 మంది పిల్లలను పాఠశాలల్లో చేర్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం భారతి, ఉపాధ్యాయిని జ్యోతి, పోలీసు సిబ్బంది ఉన్నారు.
- **వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ-** రుద్రూర్, జనవరి 22 : సీపీఎం రాష్ట్ర 4వ మహాసభలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను మండల కేంద్రంలో సీపీఎం నాయకులు బుధవారం ఆవిష్కరించారు. సీపీఎం ఏరియా కార్యదర్శి నన్నేసాబ్ మాట్లాడుతూ.. ఈ నెల 25 నుంచి 28వ తేదీ వరకు సంగారెడ్డిలో రాష్ట్ర మహాసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 25న మధ్యాహ్నం 2 గంటలకు భారీ ర్యాలీ, అనంతరం పీఎస్‌ఆర్ గ్రౌండ్‌లో బహిరంగ సభ ఉంటుందని తెలిపారు. ఏరియా కమిటీ సభ్యులు లక్ష్మణ్, భీమయ్య, నాయకులు ప్రవీణ్, కిషన్, నరేశ్, సాదిక్ తదితరులు పాల్గొన్నారు.

ధర్పల్లి జడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం సస్పెన్షన్

ఖలీల్‌వాడి, జనవరి 22 : ధర్పల్లి జడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం గణ జ్యోతిరాణిని సస్పెండ్ చేస్తూ విద్యాశాఖ ప్రాంతీయ సంచాలకుడు సత్యనారాయణరెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. పాఠశాల ఉపాధ్యాయులతో వైరం, ఇతర సమస్యలపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదులు చేసినా ఫలితం లేకపోయింది. ఉపాధ్యాయులు ఎమ్మెల్యేతోపాటు డీఈవో ద్వారా కలెక్టర్‌కు, కలెక్టర్ ద్వారా విద్యాశాఖ సంచాలకుడికి హెచ్‌ఎంపై ఫిర్యాదు చేశారు. అయినా తీరు మార్చుకోకపోవడంతో ప్రభుత్వం ఆమెపై వేటు వేసింది. గత నెలలో మధ్యాహ్న భోజనానికి సంబంధించిన బియ్యం అమ్ముకున్నారని ఫిర్యాదు రావడంతో డీఈవో అశోక్ విచారణకు ఆదేశించారు. ఎంఈవో సేవ్లా పాఠశాలలో విచారణ చేపట్టారు. పాఠశాలలో ఉండాల్సిన బియ్యం కన్నా ఏడు క్వింటాళ్ల బియ్యం అదనంగా ఉండడం, ఉపాధ్యాయుల నుంచి వివరాలు సేకరించి నివేదికను విద్యాశాఖ ఆర్‌జేడీకి సమర్పించారు. దీంతో హెచ్‌ఎం గణ జ్యోతిరాణిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఇచ్చిన హామీలను నెరవేర్చారా ?

కాంగ్రెస్ మండలాధ్యక్షుడిపై బీఆర్ఎస్ నాయకుల ధ్వజం

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నాగధర్‌రెడ్డి

వేల్పూర్ జనవరి 22: ఇచ్చిన హామీలన్ని నెరవేర్చకున్నా.. కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎమ్మెల్యేపై ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉన్నదని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జైడి నాగధర్ రెడ్డి, నాయకులు విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నర్సారెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండించారు. కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేదని తెలిపారు. ఏ గ్రామానికి అయినా వెళ్దాం.. ప్రభుత్వ పథకాలు అందుతున్నాయని చెబితే తాను ముక్కు నేలకు రాసి, రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటానని సవాల్ విసిరారు. ఎమ్మెల్యే వేముల కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీని బహిష్కరించిన విషయాన్ని వెనక్కి తీసుకోవాలా..? రాజీనామా చేయాలా..? క్షమాపణ చెప్పమంటావా..? అది కాంగ్రెస్ మండలాధ్యక్షుడి స్థాయికి తగదని చెప్పారు. ఎమ్మెల్యేకు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆయనతోపాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

జిల్లాలో రెండు జేఈఈ మెయిన్ ఎగ్జామ్ సెంటర్లు

వినాయక్‌నగర్, జనవరి 22: నిజామాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలోని చేపూర్ క్షత్రియ ఇంజినీరింగ్ కాలేజీతోపాటు అర్సపల్లి బైపాస్ రోడ్డులో ఉన్న మున్నూరు కాపు సంఘంలో జేఈఈ మెయిన్ ఎగ్జామ్ సెంటర్లు ఏర్పాటు చేసినట్లు పోలీసు అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 23, 24, 28, 29, 30వ తేదీల్లో పరీక్షలు ఉంటాయని పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 163 బీఎన్ఎస్ఎస్ అమలులో ఉంటుందని, నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరంగా చర్యలు ఉంటాయని పోలీసు అధికారులు హెచ్చరించారు.

వార్డుసభకు హాజరైన ప్రజలకు అల్పాహారం

అల్పాహారం అందజేస్తున్న రామకృష్ణ

బోధన్, జనవరి 22: పట్టణంలోని 12వ వార్డులో బుధవారం ఏర్పాటు చేసిన వార్డుసభకు హాజరైన వారికి అల్పాహారం అందజేశారు. స్థానిక బీఆర్ఎస్ పార్టీ నాయకుడు, వార్డు ఇన్‌చార్జి పెర్క రామకృష్ణ అల్పాహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అభినందించారు. బీఆర్ఎస్ కార్మిక విభాగం పట్టణ అధ్యక్షుడు నాగుల రవిశంకర్‌గౌడ్ పాల్గొన్నారు.

బైక్ అదుపు తప్పి బాలుడి మృతి

ఇందల్వాయి, జనవరి 22: బైక్ అదుపుతప్పి ఓ బాలుడు మృతి చెందిన ఘటన దొన్కల్ గ్రామ శివారులో మంగళవారం చోటుచేసుకున్నదని ఎస్సై మనోజ్‌కుమార్ బుధవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మాచారెడ్డికి చెందిన రజనీకాంత్ బంధువు ఒకరు దొన్కల్‌లో మంగళవారం మృతిచెందారు. అంత్యక్రియలు ముగిసిన అనంతరం ఆయన భార్య, ఇద్దరు పిల్లలతో బైక్‌పై తిరుగు ప్రయాణమయ